క్లుప్తంగా

నేడు సత్తెమ్మతల్లి పండగ

మునగపాక: మునగపాక దళితవాడలో ఆదివారం సత్తెమ్మతల్లి పండగ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా జూన్ మాసంలో ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న నాటు సారా

పాయకరావుపేట: గుంటపల్లి గ్రామంలో దాడులు నిర్వహించి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ (అనకాపల్లి) సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి, గుంటపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని సారాతో పట్టుకున్నట్లు తెలిపారు. సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని యలమంచిలి కోర్టుకు తరలించగా 14 రోజులపాటు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అనకాపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు టి.వెంకట అప్పలనాయుడు, పి.వి.గిరి, హెచ్.సి.ఎం.ఎస్.రాజు, వి.సంతోష్ పాల్గొన్నట్లు తెలిపారు.

15 వాహనాలకు జరిమానా

కశింకోట : కశింకోటలో జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి నడుపుతున్న సుమారు 15 వాహనాలకు జరిమానా విధించినట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని, కారులో సీటు బెల్టులను ధరించాలని వాహన చోదకులకు ఈ సందర్భంగా అవగాహన కలిగించామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

నర్సీపట్నం : హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం బ్లడ్ సెంటర్ నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంలో ఉద్యోగులు, యువకులు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, విద్యార్థులు రక్తదానం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉమానారాయణ హాస్పటల్ డాక్టర్ మల్లికార్జున్, వి.వి.ఎస్ నర్సింగ్ హోమ్ డాక్టర్ నూకరాజు పాల్గొన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో 9 సార్లు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశామని హ్యాండ్స్ వ్యవస్థాపకులు టి.మల్లేష్ పేర్కొన్నారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన జి.శ్రీనివాస్ సన్మానించారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ

అనకాపల్లి: విశాఖ డెయిరీ వేతన కార్యదర్శులు, హెల్పర్స్ 40 ఏళ్లుగా డెయిరీ అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నా నేటికీ కనీస వేతనాలు అమలు చేయడం లేదని విశాఖ డెయిరీ కార్యదర్శులు, హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డెయిరీ యాజమాన్యానికి అనేకసార్లు కనీస వేతనం అమలు చేయాలని, గ్రాట్యుటీ రూ.5 లక్షలు, డ్యూటీ టైమింగ్స్‌ను ఫిక్స్ చేయాలని కోరినప్పటికీ యాజమాన్యంలో కనీస చలనం లేకుండా పోయిందన్నారు. కనీస వేతనం ఇవ్వాలని డెయిరీ యాజమాన్యంతో చర్చలు జరిపిన సందర్భంలో 20 శాతం పెంచి జీతాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ నేటి వరకూ అమలు చేయలేదన్నారు. 200 పాల లీటర్లలోపు ఉన్న పీఎస్‌లకు హెల్పర్లకు 20 శాతం జీతాలు చెల్లిస్తామని చెప్పారని, తమ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 9వ తేదీన ఉత్తరాంధ్రలో అన్ని కలెక్టర్ కార్యాలయాలల్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. డెయిరీ యాజమాన్యం నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పెద్ద ఎత్తున ఆందోళన కార్యాచరణ రూపొందించుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చెరువులకు గర్భశోకం



పాయకరాని చెరువు గర్భం పరిస్థితి





మండలంలోని చెరువులో భారీగా మట్టిని తవ్విన దృశ్యం

- మట్టి కోసం యథేచ్ఛగా చెరువులను తవ్వేస్తున్న అక్రమార్కులు
- వీటి ద్వారానే పంట పొలాలకు సాగునీటి సరఫరా
- మట్టి తరలింపుతో సరఫరాకు ఆటంకం
- సాగునీటికి ఇబ్బందులు పడుతున్న రైతులు

పాయకరావుపేట: మండలంలోని సాగునీరు సరఫరా చేసే చెరువులను అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వేస్తూ మట్టిని తరలిస్తున్నారు. అక్రమార్జన కోసం చెరువులకు గర్భశోకం మిగులుస్తున్నారు. మండలంలోని పాయకరాని చెరువు, గోపాలరాజు చెరువు, వెంకటపతిరాజు చెరువు, చిన్న చెరువు, పెద్ద చెరువు, గజపతిరాజు చెరువు, ఆవ తదితర చెరువుల ద్వారా రైతులకు సాగునీటి సరఫరా జరుగుతోంది. శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం గ్రామాల పరిధిలోని సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో గల పాయకరాని చెరువులో ఎక్కువ వర్షాలు కురిసేటప్పుడు ఎగువ నీరు చేరి నిల్వ ఉంటుంది. తద్వారా రైతుల పొలాలకు అవసరమైన నీటిని ఉపయోగించుకుని పంటలు పండించుకుంటారు. అయితే ఈ చెరువులోని మట్టిపై కూటమి నాయకులు, అక్రమార్కుల కన్ను పడింది. వారు ఏవిధమైన అధికారుల అనుమతి లేకుండా పాయకరాని చెరువులో పొక్లెయిన్‌లతో మట్టిని తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారని పలువురు రైతులు చెబుతున్నారు.

ఆవ గర్భంలోనూ తవ్వకాలు

పాయకరాని చెరువు పరిధిలో శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం, కందిపూడి, ఈదటం, కేశవరం, రాజవరం, గజపతినగరం తదితర గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలకు సాగునీరు సరఫరా జరుగుతుంది. వెంకటనగరం సమీపాన గల వెంకటపతిరాజు చెరువు, గోపాలరాజు చెరువుల ద్వారా వందలాది ఎకరాల పంట పొలాలకు సాగునీటి సరఫరా చేస్తున్నారు. గోపాలపట్నం వద్దనున్న ఆవ ద్వారా మంగవరం, గుంటపల్లి, గోపాలపట్నం, పెంటకోట తదితర గ్రామాల రైతుల పంటలకు సాగునీరు సరఫరా జరుగుతుంది. ఇక్కడ కొందరు ఏ అనుమతులు లేకుండా ఆవ గర్భంలో కూడా అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. దీనిని ఇటుక బట్టీలు, పెద్ద పెద్ద నిర్మాణాల పునాదుల్లో నింపడానికి వినియోగిస్తున్నారు. లే అవుట్‌ల్లో పల్లం భూములను ఎత్తు(మెరక) చేసుకోవడం కోసం ఉపయోగించుకుంటున్నారు.

ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లలో తరలింపు

ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ల ద్వారా చెరువుల మట్టిని తరలిస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.2 వేలు, టిప్పర్‌కు రూ.6 వేల చొప్పున మట్టిని అమ్మి అక్రమార్జన చేసుకుంటున్నారు. రైతుల పంట పొలాలకు సాగునీటి సరఫరా జరిగే చెరువుల్లోని మట్టి కోసం లోతుగా తవ్వడం వల్ల చెరువు గర్భం లోతు పెరిగిపోయి పంట పొలాలకు సాగునీటి సరఫరా జరగడం లేదు. దీంతో రైతులు సాగునీటి సరఫరా జరగక ఇబ్బందులకు గురువుతున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి

నీటి పారుదల శాఖాధికారులు, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం, చూసీచూడనట్లుగా సిబ్బంది వ్యవహరించడం వల్ల చెరువుల్లో అక్రమ తవ్వకాలు పెరిగిపోతున్నాయి. నీటి పారుదల శాఖ అధికారులు దృష్టి సారించి చెరువుల్లో మట్టిని అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల పరిధిలోని చెరువుల ఆయకట్టుదారు రైతులు కోరుతున్నారు.

అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం

మండలంలోని చెరువుల్లో మట్టి తవ్వకాలకు ఏవిధమైన అనుమతులు ఇవ్వలేదు. వీటిపై తగు చర్యలు తీసుకుంటాం. మట్టి అవసరమైన రైతులు గాని, వ్యాపారులు గాని అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, మంజూరు చేస్తాం. అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేస్తాం. – సురేష్‌కుమార్,డీఈవో, రాజేష్, ఏఈ, నీటి పారుదల శాఖ

ఘనంగా బక్రీద్ వేడుకలు



కోటవురట్లలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



చెల్లాపురం దర్గా వద్ద బక్రీద్ నమాజ్ చేస్తున్న ముస్లింలు

కోటవురట్ల: మండలంలో శనివారం బక్రీద్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కోటవురట్ల మండల కేంద్రం ముస్లిం కాలనీలోని మసీద్ ఉస్మాన్ ఘని, మెయిన్ రోడ్డులోని మసీదుల్లో వేడుకలు నిర్వహించారు. మసీదు ఉస్మాన్ ఘనిలో హఫీజ్ అజమత్ రజ ఆధ్వర్యంలో ఈద్ అజ నమాజ్ చేశారు. అజమత్ రజ ధార్మిక ప్రసంగం చేసి బక్రీద్ పండగ ప్రాముఖ్యతను వివరించారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్‌ను జరుపుకుంటారన్నారు. ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వేడుకల్లో కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ఎస్.రాయవరం: త్యాగానికి ప్రతీకగా బక్రీద్‌ను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ముస్లిం గ్రామం చెల్లాపురం మసీద్ ఇమామ్ అన్నారు. బక్రీద్ పండగ సందర్భంగా శనివారం చెల్లాపురం దర్గా వద్ద ప్రత్యేక నమాజ్‌లు చేశారు. బక్రీద్ విశిష్టతను ఇమామ్ వివరించారు. ప్రతి ఒక్క ముస్లిం నమాజ్ చేయాలని సూచించారు.

ఎరువుల వినియోగాన్ని తగ్గించండి



బి.కె.పల్లిలో రైతులకు సాగు పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్త ప్రసాదరావు

కోటవురట్ల: పంటల సాగులో ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని బి.కె.పల్లి, యండపల్లి, అన్నవరం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాల్లో ముందుగా పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లి పెసర, అలసందలను సాగు చేసి దుక్కులో కలియదున్నాలన్నారు. దీంతో పాటు పశువుల గెత్తాన్ని కూడా దుక్కులో వేయడం వల్ల భూమి సారవంతమవుతుందని చెప్పారు. యంత్రాల వినియోగంతో కూలీల ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ఈ నెల 12 వరకు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంత్ గౌడ్, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు త్రినాథ, గంగ, రైతులు పాల్గొన్నారు.

యూరియా వినియోగంలో జాగ్రత్తలు అవసరం



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శ్రీహరిరావు

మునగపాక: యూరియా వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్త శ్రీహరిరావు సూచించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శనివారం అనకాపల్లి వ్యవసాయ శాఖ, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పల్లపు ఆనందపురం, కుమారపురం గ్రామాల్లో పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు తప్పనిసరిగా మట్టి నమూనా పరీక్షలతోపాటు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌సీ వ్యవసాయాధికారి విజేత, సర్పంచ్ కర్రి అప్పయమ్మ, పలువురు రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర కేబినెట్ నిర్ణయాలు కార్మికులకు నష్టదాయకం




కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్: రాష్ట్ర కేబినెట్ నిర్ణయాలు కార్మికులకు నష్టదాయకమైనవని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అన్నారు. కార్మిక వర్గానికి నష్టదాయకంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ కేబినెట్ నిర్ణయించడాన్ని సీఐటీయూ ఖండిస్తోందని తెలిపారు. ఈమేరకు శనివారం అచ్యుతాపురంలో కార్మికులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, మారిశెట్టి అప్పారావు, అప్పారావు, శంకరరావు, వాసుపల్లి కాసుబాబు, నూకమ్మ, దుర్గా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు



బురదమయంగా మునగపాక జగనన్న కాలనీ ప్రధాన రహదారి



గోతులమయంగా వాడ్రాపల్లి-తిమ్మరాజుపేట రోడ్డు

మునగపాక: కొద్దిపాటి వర్షం కురిసినా పలు గ్రామాల రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. మునగపాక జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి బురదమయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం సాగించే కాలనీ వాసులు తంటాలు పడుతున్నారు. పాదచారులతోపాటు వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. వాడ్రాపల్లి నుంచి తిమ్మరాజుపేటకు వెళ్లే రోడ్డు పలు చోట్ల గోతులమయంగా తయారైంది. వర్షం కురిస్తే చాలు ఈ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారుతుంది. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పక్కారోడ్లు నిర్మించి, ఇబ్బందులు తొలగించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

కృష్ణంరాజు కాలువపై బ్రిడ్జి పనులు ప్రారంభం



మునగపాక కృష్ణంరాజు కాలువపై బ్రిడ్జి నిర్మాణ పనులు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా మునగపాక మెయిన్‌రోడ్డులోని కృష్ణంరాజు కాలువపై బ్రిడ్జి నిర్మాణం కోసం శనివారం స్లాబ్ వేశారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారిని 100 అడుగుల మేర విస్తరించేందుకు చర్యలు ప్రారంభమైన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మునగపాక, హరిపాలెం గ్రామాల్లో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. ఇదిలా ఉండగా రహదారి విస్తరణలో భాగంగా భూములు, గృహాలు కోల్పోతున్న బాధితులకు ఇవ్వాల్సిన నగదు పరిహారం విషయంలో స్పష్టత లేకుండా పోయింది. మెజారిటీ బాధితులు నగదును టీడీఆర్ బాండ్ల రూపంలో కాకుండా తమ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయాల్సిందేనని పట్టుబడడంతో సమస్య కొలిక్కి రాలేదు.

కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అర్చనలు



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయం చుట్టూ భక్తులు ఏడు పర్యాయాలు ప్రదక్షిణలు చేశారు. ఆలయంలో రాత్రికి భజన కార్యక్రమం, దాతలు సహకారంతో చద్ది ఏర్పాటు చేశారు.

భారీ వర్షం.. రైతుల హర్షం



యలమంచిలిలో కురుస్తున్న వర్షం



మునగపాక మండల సముదాయానికి వెళ్లే రహదారిలో నిలిచిన వర్షపు నీరు

- ఖరీఫ్ సాగు పనులకు మేలు
- వాన నీటితో నిండిన రహదారులు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలో శనివారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు భారీ వర్షం కురిసింది. అప్పటివరకూ భానుడి ప్రతాపంతో ఉక్కపోతతో అల్లాడిన జనం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వాన కురవడంతో ఉపశమనం పొందారు. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పట్టణంలోని ప్రధాన, అంతర్గత రహదారులపై నీరు చేరింది. సౌభాగ్య అపార్ట్‌మెంట్ కూడలి, రాంనగర్ ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టిడ్కో గృహ సముదాయానికి వెళ్లే రహదారి, అత్తిలివారి చేను కాలనీ రోడ్డు బురదమయంగా మారి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. పట్టణంలో పలుచోట్ల డ్రైనేజీలు మురుగుతో నిండిపోవడంతో వర్షపు నీరు రహదారులపైకి ప్రవహించింది. ఈ వర్షం ఖరీఫ్ సాగు పనులకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

వేడిమి నుంచి ఉపశమనం

మునగపాక: మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ వేడిమితో సతమతమైన ప్రజలు మధ్యాహ్నం కురిసిన వర్షానికి సేద తీరారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో కాలనీల్లో నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం ఖరీఫ్‌లో పంటల సాగు చేసే రైతులకు మేలు చేకూరుస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

రేషన్‌కు బదులు నగదు బదిలీ ప్రక్రియను విరమించుకోవాలి

- సుదూర గిరిజన గ్రామాలకు ఎండీయూ వాహనాలతో రేషన్ అందించాలి
- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న డిమాండ్

దేవరాపల్లి: ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్‌కు బదులు నగదు బదిలీ చేసే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రేషన్ డిపోలకు సుదూరంగా గిరిజన గ్రామాల ప్రజలకు ఎండీయూ వాహనాలతో రేషన్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీడీఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు చట్ట ప్రకారం 14 రకాల నిత్యవసర వస్తువులను పంపిణీ చేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం పదే పదే రేషన్ అవసరం లేకపోతే డబ్బులు తీసుకోవచ్చునని రేషన్ లబ్ధిదారులను ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు పథకంలో 90 శాతం మేర లబ్ధిదారులకు నగదు ఖాతాలో జమకాలేదన్నారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా మూడు రకాల కార్డులను విధానాన్ని అమలు చేసి లబ్ధిదారులకు 17 రకాల నిత్యవసర సరుకులు అందించాలని కోరారు. రేషన్ మాఫియాకు ప్రధానంగా అధికార పార్టీ నాయకులే కారకులను ఆరోపించారు. మండలానికో ఏజెంట్‌ను నియమించుకొని రేషన్ బియ్యాన్ని సేకరించి రీసైక్లింగ్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా దేశంలో 1955లో పీడీఎస్ వ్యవస్థను ప్రవేశపెట్టారని, ఇప్పటికీ దేశంలో 80 కోట్ల మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అసమానతలను నిర్మూలించేందుకు రేషన్ పంపిణీని కొనసాగించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. 2013 ఆహార భద్రత చట్టం ప్రకారం 14 రకాల నిత్యవసర సరుకులు అందించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

అర్జునమ్మకు మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ



అర్జునమ్మ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : తామరబ్బ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు కడారి అర్జునమ్మ అనారోగ్యానికి గురికావడంతో ఇటీవల ఆపరేషన్ చేయించుకొని ఇంటికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తామరబ్బలోని అర్జునమ్మ ఇంటికి శనివారం చేరుకొని పరామర్శించారు. ఈ సందర్భంగా అర్జునమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ అర్జునమ్మకు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, స్థానిక సర్పంచ్ టోకురి రామకృష్ణ, ఉప సర్పంచ్ గుమ్మడపు దేవి, గుమ్మడపు మహేష్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కడారి రాజు, దాకమర్రి శివాజీ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

